# నిద్రపో అహల్యా నిద్రపో!

ఉమాదేవి

కధానిక

మూడు బాటలూ కలిసేచోట అందమైన పూలతోట.

మధ్యలో రెండంతస్తుల పచ్చ మేడ—మేడమీద బాల్కనీ. అందులో పట్టెమంచంమీదనుంచి పైన కప్పుకున్న ఆలివ్ గ్రీన్ రగ్గును వయ్యారంగా తొలగించుకుంటూ ఒక తెల్లని సుకుమార హస్తం బైటికివచ్చింది...సన్నగా గుండ్రంగా ఉన్న ఆ చేతికి నాజూకైన ఒంటిమిరియం గాజులు అయిదారు మెరుస్తూవున్నాయి. సన్నగా బొద్దుగా రానురాను కొనదేలిన సున్నితమైన వేళ్ళలో ఒక లేతాకుపచ్చరాయి ఉంగరం ఉంగరంవేలికిముద్దుగా అమరింది.

ఆహస్తం కప్పుకున్న రగ్గును పూర్తిగా తొలగించింది. కావలసినంత విశ్రాంతి లభించాక ప్రకాశించే విధంగా ఆమె నయనాలు తృప్తితో తొణికిసలాడాయి. బద్ధకంగా ఆవులిస్తూనే చుట్టూరా కలయజూచింది...అస్తమిస్తూఉన్న శశికిరణాలు ఆమె పక్కమీదపడి ఆమెను గుడ్డివెన్నెలలో ముంచివేస్తున్నాయి. మేడ గోడలకు అల్లుకున్న జాజి, మాలతీ, రాధామనోహరం లతలు రాత్రి వికసించిన పూల సౌరభంతో గాలిని నింపి ఆమెకు కానుకగా సమర్పించుకుంటున్నట్టుంది. బాల్కనీలో తొట్లలో ఉంచిన గులాబీలు అప్పుడప్పుడే విచ్చుకుంటూ ఆమెకు సుప్రభాతాన్ని చెప్పుతున్నాయి. ఇంత మధురంగా తెల్లవారినందుకు ఆమె హృదయం పరవశత్వం చెందింది. ఆ మాటకొస్తే ఆమెకు ఎప్పుడూ ఇలాగే తెల్లవారుతుంది. మెల్లిగా లేచింది...కట్టుకున్న బంగారు రంగులో కలిసే గంధంరంగు వెంకటగిరి జరీచీర ఆమె దేహకాంతిలో కలిసిపోతోంటే బాల్కనీ ముందు భాగంలోకి వెళ్ళి ఒకసారి తనివిదీరా చుట్టూరా చూచి తన గదిలోకి వెళ్ళిపోయింది. శ్రీకృష్ణపరమాత్మ, బాపూజీ, వివేకానంద, రామకృష్ణ పరమహంస మొదలైనవారి పటాలతో నిండిన ఆ గదిలో అడుగు పెట్టగానే మనస్సు శాంతితో నిండిపోతుంది. ఒక అరగంట ధ్యానంలో మునిగిపోయి తరువాత బైటికి వచ్చింది.

ఆమె తన చేతిగాజులు చూసుకోగానే రాత్రి తాను విందుకు వెళ్ళిన విషయం జ్ఞాపకం వచ్చింది. అక్కడ అనుకోనివిధంగా డాక్టర్ రాజేశ్వరీ, జానకీబాయ్, పద్మాలయా మొదలైనవాళ్ళను కలుసుకున్నది...వాళ్ళంతా ఎంత ఆప్యాయంగా మాట్లాడారు!...ఉన్నట్టుండి యింతగా తను "పాపులర్" అయిపోవటానికి వేరే యితర కారణం ఏమంటుంది! ఆ మధ్య ఏళ్ళవరూ డయాగ్నైజ్ కూడా చేయలేని జబ్బుని చౌదరిగారమ్మాయికి తాను నయం చేయటమే నేమో...తనలోతాను తృప్తిగా నవ్వుకుంది ... అన్నయ్యకు రాయాలి రాత్రి విశేషాలు. అన్నయ్య గుర్తు రాగానే ఏమిటో బెంగగా ఉంటుంది తనకు...ఇంతవరకూ ఎన్నడూ వదిలి ఉండలేదు. ఎమ్. డి. కోసం అతడు వైజాగ్ వెళ్ళి మూడు నెలలే అయినా మూడు యుగాలుగా ఉన్నాయి తనకు.

"నే పిలావదిలి వెళ్తావమ్మా!" అంటాడు అన్నయ్య.

"అలా వెళ్ళకుండా ఉండే ఏర్పాటే చేసుకోకూడదా అన్నయ్యా" అంటుంది తను! అందుకేగా కేదార్ మీద అన్నకు అంత మమత! అన్న రాగానే యీ మేడ అంతా నర్సింగ్ హోమ్, డిస్పెన్సరీగా మార్చేసి కొత్తగా కట్టుతూఉన్న మేడలోకి కాపురం ఎత్తేస్తే అక్కడ హాయిగా తనూ, అన్నా, రాబోయేవదినా, కేదార్ కలసి ఉండచ్చు... అందరూ యిక్కడే ప్రాక్టీసు పెట్టుకోవచ్చు.

ఈ ఆలోచనలతోనే మంగళ స్నానం కూడా ముగించుకుని వచ్చింది. హాస్పిటల్ డ్రెస్ వేసుకుంది...గాజులూ ఉంగరాలూ బీరువాలో పడేసింది...ఇంతలో విమలమ్మ రొట్టె కాఫీ, పండ్లూ

తెచ్చి బల్లమీద అమర్చి దగ్గరగా నిలువబడి "అమ్మాయిగారూ" అంది ఆలోచిస్తూ.

"ఏం మామ్మా!" అన్నది ఫలహారానికి ఉపక్ర మిస్తూ డాక్టర్ మంజుల.

విమలమ్మ కేవలం వంట మనిషే అయినా మంజులా వాళ్ళమ్మ బ్రతికి ఉన్నప్పటినుంచీ యిక్కడే ఉండి మంజులనీ, సాగర్‌నీ యింత వాళ్ళప్పటినుంచీ పెంచింది-సరే తల్లిపోయాక పూర్తి బాధ్యత యిక ఆమెదే అయింది. అందువల్ల ఆమెను యింట్లో మనిషిగానే చూడటం పరిపాటి అయిపోయింది వీళ్ళకు... మొన్న మొన్నటిదాకా డాక్టర్ శర్మగారు బ్రతికే ఉన్నారుగా. విమలమ్మ కూతుర్నీ, కొడుకునీ నర్సింగుకు పంపే ఖర్చీ తన మీద వేసుకుని మాట చెల్లించుకుని మరీ కన్ను మూశారాయన. వాళ్ళిద్దరికీ వీళ్ళ హాస్పిటల్‌లోనే పని యిచ్చారు కూడా... కాని కొడుకు యీమధ్యే గవర్నమెంటులో అవకాశం వస్తే వెళ్ళిపోయాడు.

"చిన్నబాబు యింకెన్నాళ్ళకు వస్తారు?"

"ఓ వారం రోజుల్లో వస్తానని వ్రాశాడు. మళ్ళీ రెండు మూడు రోజుల్లోనే వెళ్ళిపోతాట్ట" అంది దిగులుగా.

నర్సు పైకివచ్చింది... ఏమిటన్నట్లు చూచింది మంజుల.

"ఎవరోనమ్మా మీరు కావాలని వచ్చారు. పేషెంటే మోననుకుని కన్సల్టింగ్ రూంలో కూర్చో మన్నాను. కానీ ఆమె మీ స్నేహితురాలు అహల్యగారట—యింట్లోనే చూడాలన్నారు. మీ అనుమతి తీసుకుని చెపుతానని యిలా వచ్చాను" అని నివేదించింది. "అహల్యా! త్వరగా పంపు యిక్కడికి... మామ్మా! యింకొకరికి కాఫీ-ఫలహారం సిద్ధంచేసి తీసుకురా... మా అహల్య వచ్చిందట" అంది పొంగిపోతున్న ఆనందంతో...

విమలమ్మ వంటింట్లోంచి మళ్ళా అక్కడకు వచ్చేటప్పటికే మంజుల ఆ వచ్చినామెతో కబుర్లలో పడిపోయింది. ప్రయాణంవల్ల కాబోలు అహల్య చాలా అలసిపోయింది. ప్రయాణపు బడలికకంటే కూడా ఆమె ఏదో మనోవేదనతో కుంగిపోతోందని డాక్టరయిన మంజుల గ్రహించటానికి ఎక్కువసేపు పట్టలేదు... అందుకే సంభాషణను చాలా తేలిక విషయాలమీదుగా నడిపించింది.

కాఫీకప్పును తన చేత్తోనే ఆమెకు అందిస్తూ "కాఫీతాగు అహల్యా చాలా బలహీనంగా కనిపిస్తున్నావు... రాత్రంతా రైల్లో ఉండటాన నిద్ర సరిగా పట్టివుండదు. స్నానం అదీ కానిచ్చి హాయిగా నిద్రపో... నేనలా హాస్పిటల్‌లోకి వెళ్ళి పేషెంట్సుని చూసివస్తాను... అనక భోజనాలు అయాక కావలసినన్ని కబుర్లు విశ్రాంతిగా కూర్చుని చెప్పుకుందాము..." అంది లేస్తూ.

"కాదు మంజూ! నీతో అత్యవసరంగా మాట్లాడాలని—"

"పోనిస్తూ... యింతలో మునిగిపోయే దేముంటాయి మహా... నీవు విశ్రాంతి తీసుకోటం ముఖ్యం. అదుగో అప్పుడే చాలామంది ఎదురు చూస్తున్నారు కింద... మరి నేను వెళ్ళాలి" అంటూ మెరపుతీగలా కిందికి దిగి వెళ్ళిపోయింది. ఆమె హృదయాన్ని భరించలేని బాధ ఏదో తొలిచి వేస్తోందని తెలుసుకుంది మంజుల.

ఆమె వెళ్ళినవైపు చూసి అహల్య ఒక్కసారి బరువుగా నిట్టూర్చింది.

"అమ్మగారూ! మీ సామాన్లు ఆ గదిలో ఉంచాను. స్నానానికి వస్తారా—నీళ్లు చల్లారి పోతున్నాయి" అన్న పనిమనిషి పిలుపుతో బాహ్య ప్రపంచంలోకి వచ్చిపడింది అహల్య...

* * * *

అప్పటిదాకా యథాలాపంగా కబుర్లు చెపుతున్న మంజుల యీ మాటకు షాక్ తిన్నట్లు ఉలిక్కిపడింది.

"అదేమిటి అహల్యా! నా వృత్తి ధర్మానికే విరుద్ధమైన పని చేయమంటావా? ఇంత తెగింపు నీకెలా వచ్చింది?" అంది—బాధతో మిళితమైన కంఠస్వరంతో, ఒకప్పటి అహల్య పిరికితనాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

బాధగా... నీరసంగా... కసిగా నవ్వింది అహల్య.

"హు—తెగింపు! పరిస్థితులే మనలో లేని తెగింపుని కలిగిస్తాయి మంజూ—పిరికిగా వినయంగా, నమ్రతగా ఉన్నంతకాలం ఉన్నా అదే చివరకు నాకిలాంటి తప్పని సరిఅయిన పరిస్థితి సృష్టించి

యిరుకున పెట్టింది. ఎంతటి అల్పజీవి అయినా అవతలవాళ్లు పెట్టే బాధలు ఎక్కువయినప్పుడు, గత్యంతరం కానరానప్పుడు, ఎదురుతిరిగి తీరుతుంది. అలాగే నేనూ అయిపోయాను. ఇక వృత్తిధర్మానికి విరుద్ధమంటావా! లోకంలో ప్రతి ఒక్కరూ తమ వృత్తిధర్మానికి కట్టుబడేఉంటే ప్రపంచంలో యింతటి అవినీతి ఎలా ప్రబలిందంటావు? తల్లి తన బిడ్డయెడలా భర్త తన భార్యపట్లా తమ ధర్మాన్ని విస్మరించే రోజులువచ్చేస్తే ఇంకా నీకేమిటో వృత్తి ధర్మాలు! అవి ఎలాంటివో నాకు అర్థం కావటంలేదు-ఒకవేళ నువ్వు ఓపిక చేసుకుని వివరించినా అర్థం చేసుకునే స్థితిలోకూడా నేను లేను" అంది తల అడ్డంగా తిప్పుతూ.

మంజుల అటూయిటూ తిరుగుతూ బల్లమీద వాజులోఉన్న బటన్‌రోజుని చేత్తో పుచ్చుకుని సందేహిస్తూనే—

"ఇంతటి దారుణానికి ఎలా తలపెట్టావు అహల్యా? జీవితంలో మొట్టమొదటిసారిగా తల్లివి కాబోతూఉండి పుట్టని పాపమీద నీకెందుకూ యింత నిర్దయ!" అని నిగ్గదీసి అడిగింది. రాబోయే సమాధానం ఎంత తీవ్రంగా ఉండేదీ ఊహించుకుంటూ.

మందుసామాను సిద్ధంగా ఉన్నప్పుడు ఒక్క నిప్పురవ్వ తగిలితే చాలు ఒక్కసారి పేలిపోవటానికి...అలాగే యీ ప్రశ్నతో అహల్యలోని సహనం, ఓర్పు పటాపంచలయిపోయాయి. ఆవేశం పెరిగిపోయింది. హృదయంలోని బాధంతా ఒక్కసారిగా వెల్లుబికింది.

"నిర్దయా! నవమాసాలు మోసి కని యిరవైయేళ్లు పెంచి పెద్దజేసిన తల్లికి బిడ్డమీద దయ లేకుండాపోతే రూపంయేర్పడని రక్తపు కందుమీద ఏవేవో సెంటిమెంట్సు ఏర్పరచుకోనందుకు నా కాఠిన్యాన్ని గర్హిస్తూ ఆశ్చర్యపోతున్నావా మంజులా?...అయినా నేనింత సాహసానికి ఒడిగట్టటానికి మూలం ఎవరంటావు? నాలుగు రోజుల క్రితంవరకూ నేనూ సాధారణ గృహిణులందరిలాగానే పుట్టబోయే పాపనిగూర్చి ఉత్కృష్టమైన కలలే కన్నాను—కాని...యీ సంఘటన నా మనసునే విరిచివేసింది. ఇది యింతే!" అంది కళ్ళల్లోంచి కెంపులు కురుస్తోఉంటే...

"ఏమయినా కానీ...యిది చాలా అసహజంగా ఉంది అహల్యా!" అన్నది మంజుల. "మంజూ! అల్లారుముద్దుగా పెరిగావు. లేమిఅనేదేమో ఎరగవ్. అమ్మానాన్నా గారాబంచేస్తోంటే ప్రపంచంలోని కష్టాల సంగతి తెలీకుండా పెద్దదానివయ్యావు. నీ దృష్టికి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రేమించటం, వారి అవసరాలు ఏవిధంగానైనా సరే తీర్చటంతప్ప యింకేవిధంగానూ బాధించ నేరనివాళ్ళు. అవునా...కానీ యీ వింత జగత్తులో యింకా ఎన్నోరకాల వాళ్ళున్నారు మంజూ. అలాంటివన్నీ వింటే యిదేమంత అసహజం అనిపించదేమో! కాకపోయినా లోకంలో అంతా ఒకేమూసలో పోసినట్లు ఒకేరకంగా ఉండాలని ఎక్కడుంది? ప్రతిదానికీ కొన్ని ఎక్సెప్షన్సు ఉంటాయిగా. అందులో నేనొకర్తెను అవకూడదూ?"

"ఏమో . నీవు కోరేపని నేను చేయలేనుతల్లీ! నావల్లకాదు." అంది మంజుల సోఫాలో ఒరుగుతూ.

ఆమె తలవైపుగావెళ్ళి కూర్చుంది అహల్య.

"మంజూ! నేనొక విచిత్రం చెపుతాను వింటావూ? నువ్వు నమ్మలేవుకాని పూర్తిగా విన్నదాకా ఏమీ మాట్లాడకు. తరువాత నీ వ్యాఖ్యానాలన్నీ ఓపిగ్గా వింటాను. సరేనా?" అంది-లోని తీవ్రతని అణచుకుంటూ. ఎలాగైనా తాను కోరినపనికి మంజులను సుముఖురాలిని చేయాలనే పట్టుదల ఆమె బలహీనమైన కోలముఖంలో సువ్యక్తమైంది.

"అలాగే" అంది మంజుల టేబిల్ మీది ప్లేటులోఉన్న ద్రాక్షపండు తీసి నోట్లో వేసుకుంటూ...

క్షణం ఆగి మొదలుబెట్టింది అహల్య—

"మా అమ్మ మహాపతివ్రత అని నేనెప్పుడూ అనలేదు. అలాగని ఆమెనో పతితగా జమకట్టి కించపరచనూలేదు. మూడో పెళ్ళివాణ్ణి చేసుకుని కూడా కోడంటికం అనుభవించి నన్ను పెంచిన ఆమెపట్ల నా కెంతో సానుభూతి. ఆమెయెడల నాకు అపారమైన ప్రేమా గౌరవమూను..నన్ను యింతదాన్నిగా చేసింది. ఏ ఆశలూ తీరకముందే జీవితం భగ్నమైపోయిన ఆమె వక్రమార్గాలలో

పడిందంటే అందుకు జాలిపడి సానుభూతి చూప వలసిందేకాని అవమానించటం బుద్ధిమంతుల లక్షణం అంటే సుతరామూ ఒప్పుకోను...నిజానికి పద్నాలుగోఏటే బిడ్డను కని పదహారోఏటే భర్తను పోగొట్టుకున్న అభాగ్యురాలు - పైపెచ్చు ఆ భర్త మీద యీషణ్మాత్రమైనా ప్రేమా గౌరవం ఏర్పడడానికి అవకాశంలేని స్థితిలోనే ఆమూడేళ్లూ కాపురం చేసిందంటే ఆమె తన శేషజీవితం అంతా ఆయన్నే తలచుకుంటూ మడికట్టుకు కూర్చోవాలని మనం కోరుకోవటమూ అన్యాయమే...అలా మనం ఆశించటమైనా అపచారమే అవుతుంది."

అందువల్లనే ఆమెపట్ల నాకెంతో సానుభూతి. నేనేగనక ఆ మూన్నాళ్ళ ముచ్చట ఫలితంగా జన్మించి ఉండకపోతే ఆమె జీవితం మరోవిధంగా గడిచి ఉండేది. తగినవాడిని చూచుకుని పెళ్ళాడి హాయిగా ఉండేదేమో...కాని నా జన్మ ఆమెకు ఆ స్వేచ్ఛను దూరం చేసింది. అయినా నాకోసం ఎన్నో శ్రమలకు ఓర్చి నన్ను పెంచి పెద్దదాన్ని చేసింది.

నన్నెంతో ప్రేమగా చూసేది...యీ కష్టాల వల్ల మేము దూరం అయినప్పటికీ మరింత సన్నిహితులం అయామేమో ననిపించేది. నాకు బాగా ఊహ వచ్చేదాకా ఆమె ప్రవర్తన నిర్దుష్టమైంది కాదన్న సంగతి గ్రహించలేకపోయాను. ఒకరోజు ఆ సంగతి కళ్ళారా చూచి అమితమైన ఈర్ష్యతో అదేమో చెప్పరాని బాధతో కుంగిపోయాను... కాని ఎప్పుడూ బోర్డింగ్ హోంలోనే ఉండేదాన్ని కాబట్టి ఇంట్లో ఆమెదగ్గర నేను గడిపేది అతి స్వల్పకాలంగా ఉండేది.

నాకు రానురాను ఊహ తెలిసిన కొద్దీ ఆమెపట్ల సానుభూతే తప్ప ఆమె ప్రవర్తనను గర్హించలేక పోయాను...మానవ దౌర్బల్యాలు క్షమించ వలసినవే ననిపించేది...ఆమె దుస్థితికి జాలి తప్ప మరేమీ ఉండేది కాదు నా హృదయంలో. అసలు జీవితంపట్ల ఓ విధంగా విరక్తురాలనయ్యాను. నాకేమో అమ్మను ఏ విధంగానూ నొప్పించ కూడదు. నా జన్మవల్ల ఆమె కోల్పోయిన స్వేచ్ఛను కోల్పోగా ఆమె పొందగలిగే కొద్దిపాటి సుఖాల నుండైనా ఎందుకు ఆమెను వంచించాలనే పట్టుదలగా ఉండేది. ఆమెను సాధ్యమయినంతవరకూ సంతోషపెట్టాలనే ప్రయత్నించాను....

ఆమె నన్ను విద్యావంతురాలిగా చేయాలని కలలు కన్నది. తన బిడ్డ ఓ డాక్టరవాలని ఎంతో ఉబలాటపడింది. కాని విధి వేరుగా సంకల్పించాయి. ఇంటరులో గ్రూపులో నాకు వరుసగా మూడుసార్లూపోయింది. చదువంటే విసుగుపుట్టింది. ఈ టెలిఫోన్ ఎక్స్ఛేంజిలో అప్పుడే చేరాను. నాతో చదివినవాళ్ళంతా యిప్పుడు ఫైనల్ యియర్ చదువుతున్నారుగా...నా అదృష్టమో ఏమో యిలా ఉంది!" అని నిట్టూర్చింది అహల్య. "కాకపోయినా పెద్ద చదువులమీద నా కేనాడూ మోజులేదు"—అర్థోక్తిలో ఆగిపోయింది అహల్య.

నర్సు హడావుడిగా పైకి వచ్చింది.

"డాక్టర్...ఎవరో ఆయన వచ్చారమ్మా... వారింట్లో ఒకామె నొప్పులు పడుతున్నారట... అర్జంటుగా రావాలంటున్నారు" అంది కంగారు నంతా మాటల్లోనే వ్యక్తపరుస్తూ. "పద వస్తున్నా. బేగ్ తీసుకుపోయి నీవూ సిద్ధపడు. మరి వెళ్ళొస్తా నహల్యా. సీరియస్ కేసేమో, రాత్రికి మాట్లాడుకుందాం... రేడియో పెట్టుకో...ఆ బీరువాలో పుస్తకాలున్నాయి కాలక్షేపానికి" అంటూనే దిగిపోయింది మంజుల.

పుస్తకాలంటే అహల్యకు ఏమంత మమకారం లేదు. అందువల్ల రేడియో ట్యూన్ చేయటానికే ఉపక్రమించింది. హాయిగా బాలసరస్వతి పాడుతోంటే జోలట్టినట్లుయి అలాగే నిద్రపోయింది.

అనుకున్నట్లుగా రాత్రికి రాలేకపోయింది మంజుల. పొరుగూరి కేసు. రాత్రంతా ఆ యిల్లాలు విపరీతంగా ప్రసవవేదన పడి తెల్లవారు జామున ప్రసవించింది అతి కష్టంమీద...మంజుల పడ్డ శ్రమకు ఫలితంగా పెద్ద ప్రాణం దక్కింది గాని తల్లి శ్రమకు ఫలం దక్కకుండానే పోయింది. తల్లి బాగుంటే పిల్లలు మరోసారి పుడతారులే అని సరిపెట్టుకున్నారు యింటిల్లిపాదీ. బాలింతకు యివ్వవలసిన మందులూ అవీ యిచ్చి యింటివారికి ధైర్యం చెప్పి మంజుల తిరిగి తన యింటికి వచ్చేసరికి ఉదయం ఆరు గంటలయింది...ఈ సన్నివేశం ఆమె మనసుని బాధపెడుతూ వచ్చింది. అహల్యను

తలుచుకుని మంజుల హృదయం మరింత బాధతో కూరుకుపోయింది.

ఆగిపోయిన కథను తిరిగి కంటిన్యూ చేయించే సాహసం మంజులకు లేదు. సాధ్యమయినంతగా ఆ విషయం తప్పించాలని చూసింది కూడా. కాని అహల్య కుదరనిచ్చేలా లేదు. మళ్ళీ ఆ సాయంత్రం ఉపక్రమించింది కథనానికి—

"నా పెళ్ళికి మీరెవరూ రాలేదుకదూ మంజూ? నేనైనా ఎవరినీ ప్రత్యేకించి పిలవనూ లేదు. ఊరికే శుభలేఖలు పంపి ఊరుకున్నా. అసలు పెళ్ళనే తలంపు నాకు అప్పటికి లేదుకూడా. ప్రేమించి పెళ్ళాడాలంటే ప్రేమించడానికి తగ్గ యోగ్యతలు నాలో ఎవరికీ కనిపించినట్లు లేవు. ఎనిమిది నెలల నాడు అమ్మ నేను పనిచేస్తున్న ఊరికి వచ్చింది. అప్పటికే మా బామ్మ పోవటాన ఆస్తి అంతా నాకే సంక్రమించింది వేరెవరూ వారసులు లేనందున. ఒకవిధంగా నేనో ధనవంతురాలి నయ్యాననే చెప్పొచ్చు. ఆ పది పదిహేను వేల రూపాయల ఆస్తితో ... యీ రవి సంబంధం సంగతి చెప్పింది—చాలా యోగ్యుడనీ—అతన్ని పెళ్ళాడితే మా కుటుంబానికి యిక యేవిధమైన కష్టాలూ ఉండవనీను. మా అమ్మను ఎరగని వ్యక్తిని పెళ్ళాడితే ఆమె శీలాన్ని శంకించి కష్టాలపాలు చేస్తారనే సంకోచంతో ఉన్న నేను యీ సంబంధానికి సంతోషంతో అంగీకరించాను. ఇాదులో యింత పెద్ద రహస్యం యిమిడి ఉందన్న ఆలోచనే రాలేదు!

పెళ్ళి అయిన వెంటనే ఓ రెండు నెలలు సెలవు పెట్టాను. ఆరోజుల్లో అతడు నన్ను ప్రేమించినట్టే కనిపించాడు. నాకే ఆశ్చర్యం కలిగేది... నావంటి అనాకారిని ఇతనెలా ప్రేమించగలిగాడా అని... అయినా మళ్ళీ సరిపెట్టుకునేదాన్ని ఇంతకంటే కురూపులతో ఇంకా అందమైన భర్తలే కాపురం చేస్తున్నారన్న విషయం గుర్తుకు తెచ్చుకుని. సరే అదంతా భ్రమేనని యీనాడు తెలిసిందనుకో. ఏం మంజూ? అనాకారితనం క్షమించరాని మహాపరాధమా? నీ వింత అందమైనదానివంటే యిందులో నీ ఘనత ఏముంది చెప్పూ? అలాగే నా అనాకారితనమైనా నేను కోరి తెచ్చుకోలేదుగా! దరిద్రం —అనాకారితనం— తెలివి హీనత — లాంటివి ఎవరైనా కావాలని కోరుకుంటారా?" అని ఎదురు ప్రశ్న వేసిన అహల్య మొహంకేసి ఓ సారి జాలిగా చూసింది మంజుల.

తెలుపే ఐనా కళా కాంతులులేని ఆ మొహం పరిస్థితులవల్ల మరింత పాలిపోయి ఉంది. కను ముక్కు తీరు ఏవిధంగానూ ఆకర్షణీయంగా లేదు. లోపలికి పీక్కుపోయిన దవడలూ, కళ్ళూ, ఆ లావు పెదవులతో మరీ కోలగా కనిపించే ఆ ముఖం. అందులో ప్రత్యేకమైన ఆకర్షణల్లా ఆ తీర్చి దిద్దినట్టున్న కనుబొమలే...మరీ సన్నగా గాలికి పడిపోయేలా ఉంది ఆమె దేహం. తనకు తెలియకుండానే మనోజ్ఞమైన తన రూపంతో ఓసారి మనోవీధిలో పోల్చి చూచుకుంది మంజుల. మళ్ళీ అహల్య మాటలు వినిపించాయి.

"అతడు గుంటూరు కాలేజిలో బి. ఏ. లో చేరాడు. నేనూ గుంటూరు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. వీరిద్దరి పోషణలంవల్ల...ప్రస్తుతం నా ఆర్జనమీద యీ మూడు ప్రాణులూ బతకాలన్న మాట..." నవ్వింది అహల్య.

ఆ పిల్ల నవ్వులో ఉన్న లోతును అందుకోటానికి మంజులకు శక్తి చాలక భయపడ్డింది.

"అతడు కాలేజికి వెళ్ళివస్తూ ఉండేవాడు. నాకు ఆఫీసుపని ఉందిగదా — అమ్మ యింట్లో వంటపనీ అదీ చూస్తూ ఉండేది. నాకు అప్పుడప్పుడూ నైట్ డ్యూటీ కూడా ఉంటుందిగా. రానురానూ నాశరీరంలో మార్పులు వచ్చేకొద్దీ పనిచేయటంలో ఆసక్తి, చాకచక్యం, ఓపికా నాలో సన్నగిల్లటం మొదలు పెట్టాయి. పెళ్ళి అయితే హాయిగా నన్ను కూర్చోపెట్టి పోషించే భర్తను పొందటానికి బదులు నేనే పోషించాల్సిన భర్త దొరికినందుకు అప్పుడప్పుడూ నిస్పృహ కలిగేది. ఉద్యోగం మానాలనుకుంటే అతడు మాననివ్వలేదు...
"సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగం... చేస్తూ చేస్తూ మానటం దేనికీ—నా చదువైనా పూర్తి అవలేదు గదా. నేనేదో ఒక నౌకరీలో చేరగానే నిన్ను మాన్పిస్తానుగా" అని బుజ్జగించి ఒకట్రెండు సార్లు రాసిన రాజీనామా పత్రాలు కూడా తెలివిగా చింపేశాడు... నేనూ అవును కాబోలనుకున్నాను..."

"బాగుంది కథ—నీ డబ్బుకు ఆశపడి పెళ్ళాడిన బావతు అన్నమాట. ఎంతస్వార్థం!" అని వ్యాఖ్యానించింది మంజుల—తన పరిస్థితి ఎలా ఉండబోతుందో అని లోలోపల హడలిపోతూ—కేదార్‌లో యీ లక్షణాలు ఎంతవరకూ ఉన్నాయో అని తలపోస్తూ...

"ఇంకా ఎన్నోవంతు విన్నావు! అసలు తమాషా అంతా ముందేవుంది. ఆ రోజు నైట్ డ్యూటీకని బయలుదేరాను. దోవలో నలసట జాస్తిగా వుండి డ్యూటీ చేయలేనేమో అనిపించి వెళ్ళి పర్మిషన్ తీసుకుని యింటికి వచ్చాను రిక్షాలో. మా యిల్లు నీవు చూడలేదనుకుంటాను. క్రింద మూడు గదుల్లో వంటకీ భోజనాలకీ పోను ముందుది ఒక హాలు. పైన రెండు గదుల్లోనూ ఒకటి నాదీ మరొకటి ఆయనదీ ... పెళ్ళికి ముందు అందులో అమ్మ ఉండేది...తరువాత ఆమె క్రింద గదిలో ఉండటం మొదలెట్టింది.

ఆ పూట నేను వచ్చేసరికి క్రింద తలుపులు తాళంవేసి ఉన్నాయి. సరాసరి పైకివెళ్ళాను... ఆయన గదిలోనుంచి మాటలు మెట్లమీదికి వినిపించాయి. ఏ అజ్ఞాతశక్తో నన్ను మెట్లమీదే నిలిపివేసింది......ఆ చీకట్లో దీపం వేసుకోకుండా కుండా ఆయన ఎవరితో రాచకార్యాలు వెలగబెడుతున్నాడో బోధపడలేదు. ఏదో కీడు శంకించే హృదయాన్ని గట్టిగా అదిమి పట్టుకుని మెట్లమీదే కూర్చుండిపోయాను.

"రేపు నాకు అవసరంగా ఓ వంద రూపాయలు కావాలి రాజా—" తుళ్ళిపడ్డాను. రాజామణి ఎవరో కాదు!

"ఎక్కణ్ణుంచి తెమ్మంటావు రవీ? రేపు పురిటికి ఎంతవుతుందో తెలీదు కదా. ఉన్నదంతా యిప్పుడే నువ్వు ఖర్చుపెట్టేస్తే ఎలా మరి!" అంటోంది రెండో గొంతు. "కూతురిమీది అభిమానం పోనిచ్చావు కాదు...యీ పెళ్ళి అయాక నేను సుఖపడింది లేదు. నువ్వు వారానికి ఓరోజు కూడా దర్శనం యివ్వవాయె—డబ్బడిగితే యిలా మొండి చెయ్యి చూపుతున్నావు... యీ భాగ్యానికి ఆ చచ్చు పీనుగును నాకెందుకు అంటగట్టావు? నేను ఆ అస్థిపంజరాన్ని చేసుకుంది దేనికి?...నీ కోసం...నీ అందం శాశ్వతంగా నాదైపోతుందనీ—నీ ధనం పరులపాలు కాకుండా నాకు సవ్యంగా దక్కుతుందనేగా? అప్పుడు నువ్వు నామీది మోజుకొద్దీ నన్ను శాశ్వతంగా నీవాణ్ణి చేసుకోవాలని తియ్యని కబుర్లు చెప్పి ఒప్పించి నీ కూతుర్ని నా మెడకు కట్టి యీ రోజు నేను డబ్బు యివ్వమంటే ఆ కూతురిమీద మమకారం ఒలకబోస్తావేం!" అని విసురుగా, గద్దింపుగా అన్నాడు...అప్పట్లో నా పరిస్థితి ఎలా ఉండి ఉంటుందనుకుంటావు!... భూమి ఎందుకు బద్దలవదూ? ఆకాశం ఎందుకు విరిగిపడదూ?...సముద్రాలు ఎందుకు పొంగిరావటం లేదూ? అనిపించింది...కళ్ళు చీకట్లు కమ్మాయి. పై సంభాషణ ఎలా ముగిసిందీ తెలుసుకునే ఓర్పు లేకపోయింది...సరాసరి నాతో పనిచేసే కమల యింటికివెళ్ళి పడుకున్నాను...ఉద్వేగంతో నా గుండె చివరకి కొట్టుకోటం మానేస్తుందేమోననిపించింది.

జాలిగా సానుభూతితో అహల్య భుజంమీద చేయివేసింది మంజుల...ఆమెకు తన సానుభూతిని ఎలాంటి మాటల్లో వ్యక్తపరచాలో తెలియటం లేదు..."భార్యకు ద్రోహంచేసే భర్తలూ భర్తని మోసంచేసే భార్యలూ లోకంలో కోకొల్లలు... అందువల్ల రవిని నేను తప్పుపట్టలేను—కాని కన్నబిడ్డకే అన్యాయం చేసే తల్లులుంటారా? పోనీ వివాహం అయ్యాక ఉన్నట్లుండి మోహం పుట్టుకొచ్చిందనకొన్నా అదెలా ఉండేదో...కానీ తన పూర్వస్నేహాన్ని శాశ్వతంగా నిలుపుకోటానికి తన ప్రియుడికి ఆస్తి కట్టబెట్టటానికి కన్న కూతుర్ని బలి యివ్వగల తల్లులుంటారని ఏ నాడన్నా విన్నావా?

"నేను అనాకారినని రవి అన్నందుకు కించపడను. నన్ను నన్నుగా వరించి నా అందహీనతనే స్వీకరించి వివాహమాడేభర్త భర్తగాని నా తల్లి సౌందర్యానికి వశుడై నన్ను పెళ్ళాడినవాడు నా భర్తలా అవుతాడు? అలాంటి వ్యక్తిని నిజపరిస్థితి తెలిశాక ఇక నేనెలా భరిస్తాను?... ఆవేదనలో ఆ పూట ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. మనస్సు పరిపరివిధాల పోయింది. వెర్రిమొర్రి ఆలోచనలు ఎన్నో వచ్చాయి. దహించి వేసే

హృదయం...కణతలు పగిలిపోయేలాగున ఆలోచించా...కళ్ళు కాయలు కాచేలా ఏడ్చాను... ఇహ వాళ్ళ మొహాలు చూడాలనిపించలేదు... చావాలనే సంకల్పంనుంచీ విరమించుకున్నాను. ఏం? ఎందుకు చావాలి? ఇంకా వాళ్ళకు పూర్తిస్వేచ్ఛ యివ్వటానికా? నా చావువల్ల వాళ్ళకు మరింత లాభమే! నేనే అన్నివిధాలా నిండుజీవితానికి నీళ్ళొదులుకు పోయేది...మళ్ళీ ఆ తలంపు పెట్టుకో లేదు—ఆలోచించీ ఆలోచించీ యీ నిర్ణయానికి వచ్చాను. పది రోజులు సెలవు పెట్టి నీ దగ్గరకు బయలు దేరాను ... ఇప్పుడు నువ్వీ పని చేయక తప్పదు—ఏమంటావు మంజూ?" ఆశగా అడిగింది మంజుల నీలికళ్ళల్లోకి అనునయంగా చూస్తూ.

ఆ అపూర్వ సన్నివేశాలనుగూర్చి వింటూ ఉక్కిరిబిక్కిరి అయిపోతున్న మంజుల యీ ప్రశ్నకు వెంటనే సమాధానం యివ్వలేకపోయింది. కాసేపటికి తెప్పరిల్లి "అదికాదు అహల్యా...ఆరు నెలలు ఎలాగూ దాటిపోయాయా? ఇప్పుడు నువ్వు కోరింది చాలా ప్రమాదకరం...యీ నాలుగు నెలలూ నాదగ్గరే ఉండు...మామూలుగా పురుడు వెళ్ళాక తరువాత కార్యక్రమం ఆలోచించవచ్చు" అంది.

"అదే కుదరదు మంజూ! రూపం అంటూ ఏర్పడి కంటికి కనుపించాక యింకా అనవసరమైన మమకారాలు కలగచ్చు. ఆ వివాహంగాని, ఆ భర్తనుగాని జ్ఞప్తికి తెచ్చే చిహ్నాలుగూడా నాకు పనికిరావు. నాకు మళ్ళా కొత్తజీవితం కొత్త పరిసరాల్లో ప్రారంభించాలని ఉంది. నేను నేనుగా జీవించాలని ఉంది. ఒక్కమాటలో చెప్పాలంటే నాకు చావాలని లేదు. నన్ను వ్యక్తిగా చూసి నా ప్రేమను స్వీకరించి తిరిగి ప్రేమించగల వ్యక్తే దొరికితే మళ్ళీ నూతనజీవితం ప్రారంభిస్తాను. అందుకు యీ ప్రతిబంధకం నాకు వద్దు. తల్లికీ తండ్రికీ కూడా అక్కరబట్టని నిసుగును సంఘంలో వదలటం ఆ బిడ్డపట్ల అన్యాయమే అవుతుంది. పుట్టని బిడ్డకు తల్లిగా యీ ఒక్క ఉపకారమన్నా ఆ శిశువుకు చేయనీ నన్ను. అందుకేగా మూర్ఖంగా ఏపాటి మనుష్యులయినా చేయగల యీ పని కోసం ప్రత్యేకంగా, సమర్థతగల డాక్టరువని నీదగ్గరకు వచ్చింది! మరి కాదనకుండా మంజూ— నీ స్నేహితురాలికి యీపాటి సహాయం నువ్వు చేసితీరాలి" అంది ప్రాధేయపడుతూ ఉన్నట్టు.

మంజుల మాత్రం ఏమనగలదు? "సరే అలాగే చేద్దాంలే—మన చేతిలో పనేగా తొందరేముంది. రేపు చూస్తాను" అని అప్పటికి తప్పుకుంది.

* * *

రేపు రేపంటూనే వారంరోజులు గడిపి వేసింది మంజుల...ఆమెకు చేతులారా అలాంటి పని చేసేందుకు ధైర్యం చాలటంలేదు. మనస్సాక్షి



ఒప్పటంలేదు ... వృత్తిధర్మం అడ్డుపడుతోంది. అలాగే రోజులు గడిపివేయాలని ఆమె సంకల్పం... అహల్య కాస్తా యీ విషయం ఎలాగో పసిగట్టేసింది...

ఆ రోజు మంజుల పురిటి కేసుకని దగ్గరలో ఉన్న మరో పల్లెటూరికి వెళ్ళింది. సాయంత్రానికి తిరిగి వచ్చింది ఎప్పటిలాగా అలసి సొలసి... స్నానం పానం అయాక అహల్యని చూడాలని ఆమె గదిలోకి వెళ్తే కనిపించలేదు...కీడు శంకిస్తూనే గబగబా క్రిందకుదిగి వెళ్ళింది హాస్పిటల్ లోకి...ఒక గదిలో స్పృహతప్పి పడిఉన్న అహల్యను చూచేసరికి ఆమె నవనాడులూ కుంగినట్లయింది. గబగబా దగ్గరకువెళ్ళి నాడి చూచింది. జరిగిన విషయమంతా క్షణంలో అవగాహన చేసుకుంది...“ఎంత పని చేశావు అహల్యా!” అని బాధతో నుదుటిమీద కొట్టుకుంది.

నర్సుని పిలిచి గద్దించేసరికి అసలు సంగతి బైట పడింది. ఏపని చేయకుండా మంజుల ప్రతిరోజూ వాయిదా వేస్తూ వచ్చిందో అపనే నర్సు ధన లోభంతో ఇట్టే చేసివేసింది!...కాని అది మరోలా పరిణమించింది...తాను ఒక్కపూట లేకపోయేసరికి జరిగిన యీ అఘాయిత్యానికి నర్సుని నానా చీవాట్లు పెట్టింది మంజుల...అహల్యను అపాయ స్థితినుండి తప్పించటానికి ఆ రాత్రంతా శక్తివంచన లేకుండా ప్రయత్నించింది.

తెల తెలవారబోయే ముందు అహల్యకు స్పృహ వచ్చింది ... బలహీనంగా కనురెప్పలు పైకెత్తి మంజులను చూచింది. అలాగే ఎంతో ప్రయత్నం మీద “మంజూ...నీవు వద్దన్న పని చేశాను... ఆమెను...ఏమీ...అనకు...అబ్బా...చావాలని... లేదు...నన్ను...బతికించగలవా...మం...జూ..” అంది నీరసంగా నవ్వుకాని నవ్వ నవ్వుతూ...

ఆ నవ్వు మంజుల హృదయాన్ని చీల్చివేసింది. అది తన శక్తిసామర్థ్యాలకో సవాల్‌గా తోచింది.

“తప్పకుండా బతికిస్తాను అహల్యా! మీవాళ్ళని పిలిపించమంటావా?” అంది తన ప్రశ్న ఎంత బేసబుగా ఉందో గ్రహిస్తూనే...అసహ్యంతో అహల్య మొహం జేవురించి క్షణకాలం వివర్ణమైంది... అది గమనించి “పిలవనులే అహల్యా” అంది మంజుల నొచ్చుకుంటూ.

ఆ పూటంతా మందులు గుప్పిస్తూనే ఉంది. ఇంజక్షన్లు యిచ్చింది యిచ్చినట్లే ఉంది...కానీ ఆమె ప్రయత్నమంతా బూడిదలోపోసిన పన్నీరే అయింది. అహల్య శాశ్వతంగా మంజుల హాస్పిటల్‌లోనే కన్నుమూసింది...

“చావాలనిలేదు మంజూ” అన్న ఆమె పలుకు గుర్తుకువచ్చి “ఈపాపిని క్షమించు అహల్యా” అని కెవ్వున కేకపెట్టి ఆమెమీద పడిపోయింది మంజుల తీరని దుఃఖభారంతో— ★

---

తిట్టుకోవడం, పోట్లాట, లేనిదీ ఆ దంపతులకి దినరోగడవదు. ఒకనాడు ప్రాణం విసిగి భర్త, “మీ నాన్న తెలివితక్కువపని చేశాడు. ఒక శుద్ధ అప్రయోజకుడూ, చెవలవాజమ్మా ఐనవాడిని నీకు మొగుడుగా వెతకవలసింది” అన్నాడు. భార్య నిశ్చింతగా, “వెతకకేం, వెతికాడు!” అంది.

“వెతికాక ఊరుకున్నాడేం?” అని ఉరిమాడు భర్త.

“ఊరుకోలేదు. నన్నిచ్చి పెళ్ళిచేశాడు!” అంది భార్య, నిట్టూర్పుగా.

* * *

తన డెబ్భయ్యో జన్మదినోత్సవ సమయంలో-అమెరికా రచయిత మార్క్ ట్వైన్ అన్నమాటలు: “ఆరోగ్యం కాపాడుకోవడంలో నాకు కొన్ని కఠోర నియమాలున్నాయి. నిద్రపోతున్నప్పుడు ససేమిరా చుట్ట కాల్చను; మెలకువగా ఉన్నప్పుడంతా చుట్ట కాల్చడం ఒక నిముషంకూడా మానను; ఒక చుట్ట కాలిపోయాకగాని యింకోటి వెలిగించను.”